క్లుప్తంగా

భూమన నివాళి



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : పీపీ చావడి పెద్ద మసీదు మాజీ ముతవల్లీ పటేల్ అబ్దుల్ మజీద్ సాహెబ్ పార్థివదేహానికి చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి నివాళులర్పించారు. అలాగే పార్టీ నాయకులు, అంకాలమ్మ ఆలయ మాజీ సభ్యుడు శెట్టిపల్లి లక్ష్మయ్య శుభస్వీకరణకు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గాజులమండ్యంలో అవిలేలి రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల ఆయన తండ్రి అవిలేలి వెంకట్రామిరెడ్డి మరణించడంతో భూమన వారి నివాసానికి వెళ్లారు. అలాగే 19వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నాగయ్య మృతికి ఆయన నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ అనీష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు మృతికి ...



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: తన నటనా చాతుర్యంతో అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించిన విలక్షణ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద కోట చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. హాస్యనటుడిగా, ప్రతి నాయకుడిగా నవరసాలు పండించగలిగిన కోట శ్రీనివాసరావు తెలుగు ప్రజల గుండెల్లో చెక్కు చెదరని స్థానం సంపాదించుకున్నారని, ఆయన లేని లోటును ఎవరూ పూరించలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం యాదవ్, నాయకులు రాజశేఖర్ రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, రంగస్థల కార్యదర్శి రాజా, సభ్యులు, విద్వాన్ కస్పా పద్మనాభం, చంగల్ రాయులు పాల్గొన్నారు.

అజయ్‌కు బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అజయ్ ప్రసన్నకుమార్

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన మ్యాథ్స్ లెక్చరర్ అజయ్‌ప్రసన్నకుమార్ బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నారు. 20 ఏళ్లుగా పలు రంగాలలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో చేసిన కృషిని గుర్తించి ఫోరం ఫర్ ఆర్‌టీఐ సంస్థ ఆయనకు ఈ అవార్డు ప్రకటించింది. ఆదివారం నరసరావుపేటలో నిర్వహించిన ఫోరమ్ ఫర్ ఆర్‌టీఐ రాష్ట్ర సదస్సులో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు పి.చంద్రమోహన్, ఎం.ప్రసాద్, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ చేతుల మీదుగా ఆయనకు అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

ఇలా చేస్తే ఎలా..?

- చెత్త వస్తువుల కేంద్రంగా మారిన వైఎస్సార్ రిసెప్షన్ సెంటర్
- రూ.4.50 లక్షల తుడా నిధులతో నిర్మాణం
- గత ప్రభుత్వంలో అర్జీదారుల కోసం ఏర్పాటు



నిరుపయోగంగా వైఎస్సార్ రిసెప్షన్ సెంటర్

తిరుపతి అర్బన్: వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయ వద్ద తుడా నిధులు రూ.4.50లక్షలతో వైఎస్సార్ రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేశారు. నగరంలో నెలకు కేవలం వివిధ సర్టిఫికెట్ల కోసం 10వేల మందికిపైగా వచ్చివెళ్తుంటారు. దీనిని దృష్టిలో అందరి సౌలభ్యం కోసం వైఎస్సార్ రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సెంటర్ ఉద్దేశం గాడి తప్పింది. చివరకు దానిని విరిగిపోయిన కుర్చీలు, బెంచ్‌లు, చెత్త వస్తువులతో నింపేశారు. ఫలితంగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేవారు కనీసం కూర్చోవడానికి స్థలం లేక నానా ఇక్కట్లు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

జోరుగా పేకాట దందా

- అధికార పార్టీకి చెందిన ఓ నేత కనుసన్నల్లో గ్యాంబ్లింగ్
- పోలీసు శాఖలోని ఓ చిరు ఉద్యోగి సహకారం
- పేకాటాడే సమీపంలో పోలీసు వాహనంతో పహారా
- కొన్ని రోజులుగా సాగుతున్నా గుర్తించని నిఘా వర్గాలు



సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. ఇన్నాళ్ల పాటు సహజ వనరులు, ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడిన నేతలు, ఇప్పుడు గ్యాంబ్లింగ్‌పై దృష్టి పెట్టారు. తమ పార్టీ అధికారంలో ఉండడం, అన్ని శాఖల అధికారులు అధికార పార్టీ నేతల చేతుల్లో ఉండడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. చంద్రగిరి మండలంలో పచ్చనేతలు మరో అడుగు ముందుకేసి అనధికారికంగా పేకాట ఆడించడంలో తలమునకలవుతున్నారు. ఒక్క రోజుకు లక్షల రూపాయల పేకాటలో చేతులు మారుతున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో చంద్రగిరి సమీప పంచాయతీకి చెందిన ఓ మాజీ సర్పంచ్‌తోపాటు మరో ఇద్దరు కలసి గత కొంత కాలంగా నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడిస్తున్నట్లు సమాచారం. మండల పరిధిలోని పిచ్చినాయుడుపల్లి, గంగుడుపల్లి, అగరాల, పనపాకం, శ్రీనివాస మంగాపురం, మల్లయ్యపల్లి, శానంబట్ల సమీపంలోని మారుమూల ప్రాంతాలను పేకాట స్థావరాలుగా మార్చుకున్నట్లుగా తెలుస్తోంది. చంద్రగిరి, తిరుపతితోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పేకాటరాయుళ్లను పిలిపించుకుని, అనధికారికంగా పేకాటను నిర్వహిస్తున్నట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. ఒక్కరోజు పేకాట ఆడించేందుకు టీడీపీకి చెందిన ఆ నేతలు పెద్ద ఎత్తున కమీషన్లను గుంజుకుంటున్నట్లుగా తెలుస్తోంది.

లక్షల్లో చేతులు మారుతున్న వైనం

అనధికారికంగా చంద్రగిరిలో టీడీపీ నాయకులు కనుసన్నల్లో సాగుతున్న పేకాటలో రోజుకు లక్షల్లో చేతులు మారుతున్నట్లుగా తెలుస్తోంది. ముందుగానే ఆ నేతలు పేకాటకు అనువైన ప్రదేశాన్ని ఎంచుకుటారు. ఆపై వాట్సాప్ గ్రూపు ద్వారా గంట ముందు పేకాటరాయుళ్లకు లోకేషన్లను షేర్ చేస్తారు. అయితే స్థావరాలకు దూరంగా, ఎవరికి అనుమానం రాకుండా వాహనాలను పార్కింగ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. పేకాటాడే స్థావరాల వద్ద ఆ నేతలు మందును సైతం అందిస్తున్నారన్న సమీప గ్రామాల ప్రజలు చెబుతున్నారు. గత కొంతకాలంగా ఈ దందా సాగుతోందని పేర్కొంటున్నారు.

పోలీసు శాఖలో ఓ చిరుద్యోగి సహకారం?

తెలుగు తమ్ముళ్ల అనధికార పేకాటకు చంద్రగిరి పోలీసు శాఖలో ఓ చిరుద్యోగి సంపూర్ణ సహకారం అందిస్తున్నాడన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. పోలీసు రైడింగ్‌కు రాకుండా తాను చూసుకుంటానని, అందుకోసం పేకాటాడే రోజు డీల్ కుదుర్చుకున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ చిరుద్యోగి పోలీసు వాహనాన్ని పేకాటాడే స్థావరాలకు కొద్ది దూరంలో ఉంచి, పహారా కాస్తున్నట్లుగా ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందు కోసం పేకాటరాయుళ్ల నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. తనతో పాటు విధుల్లో ఉండే అధికారులకు, పోలీసుస్టేషన్‌కు కొంత పంపించాలంటూ వారితో డీల్ చేసుకున్నట్లుగా సమాచారం. గత కొన్నేళ్లుగా చంద్రగిరి పోలీసు స్టేషన్‌లోనే తిష్టవేసిన ఆయన, ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ ప్రభుత్వంలోని నేతలను ప్రసన్నం చేసుకుంటూ ఇక్కడే కొనసాగుతున్నాడన్న ఆరోపణలు లేకపోలేదు. కింద స్థాయి ఉద్యోగి అయినా తాను లోకల్ అంటూ పోలీసు స్టేషన్‌లో ఆయన హవా సాగించడంతో సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చంద్రగిరిలో విచ్చలవిడిగా, అనధికారికంగా సాగుతున్న పేకాట దందాపై అధికారులు చర్యలు తీసుకోవాలని, సహకరిస్తున్న వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చక పండితులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఆదివారం శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతూలూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసం దినిష్టా నక్షత్రం రోజున విశ్వ బ్రాహ్మణ సంఘం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. తొలుత విఘ్నేశ్వరపూజ, పతాకావిష్కరణ, హోమం, విశ్వకర్మ మహాయోగం ,మహాపూర్ణాహుతి అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి వేదికపై కొలువు దీర్చారు. అనంతరం వీర బ్రహ్మేంద్రస్వామి వారసులలో ఏడవ తరానికి చెందిన వీరంభట్లయ్య, ఉమాగౌరి దంపతుల చేతుల మీదుగా కల్యాణోత్సవం పండితుల వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల హోరు, భక్తుల సందడి నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, సుగుణమ్మ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం తిరుపతిలో నిర్వహించడం ప్రజల అదృష్టమన్నారు. స్వామివారి కల్యాణ తలంబ్రాలు, ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం జాతీయ అధ్యక్షుడు పులిగల్ల రంగాచారి, జిల్లా నేత మార్గాచార్యులు ఉమాపతి ఆచారి, మధు ఆచారి, నారాయణ పీఠం ప్రతినిధి విజయకుమార్, గీతామందిరం ఆశ్రమ అధిపతి పుండరీక వరదానంద స్వామి, గిరిబాబు ఆచారి, శివకుమార్, చంద్రాచారి, విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, విశ్వ బ్రాహ్మణ కుటుంబీకులు, ప్రజలు పాల్గొన్నారు.

'రాజా... ఆట మొదలైంది' షూటింగ్ ప్రారంభం



వెబ్ సిరీస్ షూటింగ్‌కు క్లాప్ కొడుతున్న భీమాస్ అధినేత భీమాస్ అశోక్

తిరుపతి కల్చరల్: కేఎంఆర్ ప్రొడక్షన్ పతాకంపై జీనైస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ సహకారంతో నిర్మిస్తున్న 'రాజా... ఆట మొదలైంది' వెబ్ సిరీస్ షూటింగ్ ఆదివారం శెట్టిపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రారంభమైంది. భీమాస్ అధినేత భీమాస్ అశోక్ క్లాప్ కొట్టి షూటింగ్ ఆరంభించారు. దర్శకుడు క్రిస్టఫర్ కిరణ్ మాట్లాడుతూ, భారతదేశంలోని పురాతన శిల్ప సంపదను విదేశీయులు తరలించకుండా కాపాడుకోవాలనే ఇతివృత్తంతో సస్పెన్స్, కామెడీ, వినోదాత్మకంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు . తిరుపతి పరిసర ప్రాంతాలలో నూతన నటీనటులతో ఈ సిరీస్ తీస్తున్నట్టు చెప్పారు. హీరోగా సాయి మోక్షిత్ రెడ్డి, హీరోయిన్‌గా యశ్వస్విని, సహ నటులుగా భీమాస్ అశోక్, కామెడీ శాస్త్రి, రామిరెడ్డి, శాంబోలు హరి, ప్రియ, భానుప్రకాష్, గోపి, విల్సన్, గణేష్, రాహుల్, జ్ఞానదీప్ నటిస్తున్నారని తెలిపారు. చిత్రానికి నిర్మాతగా కె.హరిబాబురెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కో-ఆర్డినేటర్ వీఎస్. రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట రూ.85లక్షలు దండుకున్నారు!

–మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

తిరుపతి కల్చరల్: ఉద్యోగాల పేరిట డబ్బులు దండుకుని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని తిరుపతికి చెందిన బాధితులు ఉమాపతి, ఖాజా విజ్ఞప్తి చేశారు. తిరుపతి ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో పని చేసే జూనియర్ అసిస్టెంట్ హారిక రెవెన్యూ విభాగంలో బ్యాక్‌లాగ్ పోస్టులు తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇస్తామని నమ్మపలికారని ఆరోపించారు. ఆమె బంధువులతో కలిసి వ్యూహం ప్రకారం ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించారని, అనంతరం ఉద్యోగాలు పొందాలంటే 5 లక్షల నుంచి 20 లక్షల చొప్పున 14 మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ.85 లక్షలు వసూలు చేసి ఉద్యోగాలు తీసిచ్చిన పాపానపోలేదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే దిక్కున్న చోటుకు వెళ్లి చెప్పుకోండని బెదిరింపులకు పాల్పడుతోందని తెలిపారు. దీనిపై జిల్లా ఎస్పీని కలిసి తమ గోడు నివేదించామని, ఇప్పటివరకు స్పందించలేదని, ఇకనైనా తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాధ్యతతో పని చేయాలి



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న చంద్రగిరి మండల నేతలు



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో రామచంద్రాపురం నేతలు

తిరుపతి రూరల్: వైఎస్ఆర్ సీపీకి అనుబంధ విభాగాల్లో కీలక పదవులు పొందిన వారంతా పార్టీ పురోభివృద్ధికి బాధ్యతతో పనిచేయాలని చంద్రగిరి నియోజకవర్గం సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచించారు. ఆదివారం చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం మండలాల నుంచి పదవులు పొందిన పలువురు నేతలు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన వారితో సమావేశమై పార్టీ పదవులు పొందిన వారంతా ఇకపై యాక్టివ్‌గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను జనంలోకి తీసుకువెళ్లడానికి కృషి చేయాలన్నారు. సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రభుత్వ తీరును, స్థానిక ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలు, అరాచకాలను ప్రజలందరికీ చేరువ చేయాలన్నారు. చట్టాలను అతిక్రమించకుండా శాంతియుత పోరాటాలు సాగించేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలన్నారు. జగనన్న సైనికులుగా పనిచేసే గొప్ప అవకాశం రావడం మనమంతా అదృష్టంగా భావించాలని, 2029 ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడానికి కష్టపడాలన్నారు. కూటమి ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకువెళ్లడంలో ముందుండాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు.

నోటీస్ బోర్డు

- జిల్లా పోలీసు సిబ్బందికి అమర హాస్పిటల్ ఆడిటోరియంలో ఉదయం 9.30 నుంచి వార్షిక వైద్య పరీక్షలు.
- జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'.
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ కమిషనర్, 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక.

కందారపు మురళి కుటుంబానికి సుద్దాల పరామర్శ



పరామర్శిస్తున్న సుద్దాల అశోక్ తేజ దంపతులు

తిరుపతి కల్చరల్: తల్లిని కోల్పోయి విషాదంలో మునిగి ఉన్న కందారపు మురళి కుటుంబాన్ని ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. మరణానంతరం రాజమ్మ నేత్రదానం చేయడంపై ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. కందారపు రాజమ్మ పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించారంటూ అమ్మ గురించి ఓ కవితను ఆయన వినిపించారు. కార్యక్రమంలో సుద్దాల సతీమణి సుద్దాల నిర్మల, ధర్మయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, రంగస్థల కళాకారులు ధర్మయ్య, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున ఉన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



తిరుచ్చిపై శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేసి, వైఖానస ఆగమోక్తంగా దేవేరుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు తన దేవేరులతో కలసి వాహన మండపం వద్దకు వేంచేపు చేశారు. బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

పాకాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం తిరుపతి మాధురి వైద్యశాల, వాసన్ కంటి వైద్యశాల వైద్యుల సహకారంతో పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. 206 మంది సాధారణ వైద్య పరీక్షలు, 148 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుమారు రూ.22,000 విలువైన మందులను ఉచితంగా అందజేశారు. 30 మంది ఆరోగ్య వైద్య సేవలకు మాధురి వైద్యశాలకు, 20 మంది కాటరాక్ట్ కంటి వైద్య సేవలకు వాసన్ కంటి వైద్యశాలతో గుర్తించబడ్డారు. డాక్టర్లు హరిదీప్, అభిషేక్, బాలకృష్ణ, సీఈఓ మంజునాథ్, డీఓ జి.రవీందర్‌రెడ్డి, లోకేష్, సునీల్‌కుమార్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కేఎస్.తులసీరామన్, కోశాధికారి కుప్పుస్వామినాయుడు, రామయ్య, ఆర్‌వీ ప్రసాద్, జయరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



విద్యార్థినులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఆశ్రమ మేనేజర్ అమరనాథరెడ్డి

ఏర్పేడు: స్థానిక ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ వ్యాసాశ్రమంలోని వెంకటేశ్వరా కల్యా గురుకుల పాఠశాలలో చదువుతున్న 435 మంది విద్యార్థినులకు ఆదివారం ఉచితంగా దుస్తులు(పంజాబీ డ్రెస్సులు)ను ఆదివారం ఆశ్రమ మేనేజర్ మన్నెం అమరనాథరెడ్డి పంపిణీ చేశారు. ఆశ్రమంలోని అధిష్టాన మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణగా మసలుకోవాలని, చదువుల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

వాహనదారులకు తప్పని తిప్పలు



కాలువలోని ఇనుప గ్రిల్స్‌లో వాహనం ఇరుక్కుపోవంతో వాహనాన్ని ముందుకు నెడుతున్న మహిళా రైతులు

- నెలలు తరబడి పరిష్కారం కాని రహదారి కాలువ సమస్య

చంద్రగిరి: అధికారుల నిర్లక్ష్యానికి పైఫోటోలో కనిపిస్తున్న దృశ్యం ఒక ఉదాహరణ. చంద్రగిరిని అభివృద్ధి బాటలో పరుగులు తీస్తోందని గొప్పలు చెప్పుకునే నేతలకు ఆరు నెలలుగా నెలకొన్న సమస్యను పరిష్కరించకపోవడంపై రైతులు, స్థానికులు మండిపడుతున్నారు. స్థానిక చంద్రగిరి ఏరియా ఆసుపత్రి మార్గంలోని ప్రధాన రహదారి వద్ద నెలకొన్న సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక టవర్‌క్లాక్ కూడలి నుంచి నిత్యం ఏరియా ఆసుపత్రికి, కోదండరామస్వామి వారి ఆలయానికి, విద్యుత్ సబ్ స్టేషన్, ప్రభుత్వ బాలుర హాస్టల్, వారపు సంతకు ప్రజలు రాకపోకలను సాగిస్తున్నారు. ఈ క్రమంలో మార్గం ప్రారంభంలో గతంలో అధికారులు మురుగు వెళ్లేందుకు కాలువను ఏర్పాటు చేశారు. కాలువపై ఇనుప గ్రిల్స్‌ను నిర్మించారు. అయితే గత కొద్ది నెలల క్రితం గ్రిల్స్ విరిగిపోవడంతో వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు నెలొకన్నాయి. ఏరియా ఆసుపత్రి నుంచి అత్యవసర పరిస్థితుల్లో రోగులను తిరుపతి రుయాకు తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో కాలువ వద్ద గ్రిల్స్ విరిగిపోవడంతో 108 వాహనం సైతం వెళ్లేందుకు కష్టతరమవుతోంది. కాలువను దాటేందుకు ద్విచక్ర వాహనాదారులు వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు కింద పడిపోతున్నారు. ఆదివారం వారపు సంత కావడంతో మధ్యాహ్నం రైతులు పంటను విక్రయించుకోవడానికి టాటా ఏస్ వాహనంలో సంతకు బయల్దేరారు. కాలువలో వాహనం ఇరుక్కుపోవడంతో మహిళా రైతులు ఇలా తలో చెయ్యి వేసి బండిని ముందుకు నెట్టుకురావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంతో శ్రమించి ఎలాగోలా వాహనాన్ని ముందుకు తొయ్యడంతో సంతలోకి వాహనం వెళ్లింది. గత ఆరు నెలలుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. వేలం పాట ద్వారా పంచాయతీకు లక్షల రూపాయలు చెల్లిస్తున్నా, సమస్యను పరిష్కరించడంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, కాలువ ఇనుప గ్రిల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నాగేంద్ర హారాయ.. త్రిలోచనాయ..



– శిల్పారామంలో ఆకట్టుకున్న భరతనాట్యం

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తిరుపతికి చెందిన శ్రీనాట్యాలయ బృందం ఆధ్వర్యంలో భరతనాట్యం ప్రదర్శించారు. ఇందులో భాగంగా వక్రతుండ మహాకాయ అంటూ సాగిన పాటతో మొదలై వివిధ పాటలకు కళాకారులు భవిశ, ధామిని, రోషిణి, ఇసైప్రియ, కీర్తన, తనుశ్రీ, రమ్య చూడచక్కని హావభావాలతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

